# సాక్షి
## వైఎస్సార్ జిల్లా

బుధవారం ၊ 31 ၊ మే ၊ 2023






**అత్తింటి ఆరళ్లకు అబల బలి**

అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు భరించలేక ఓ మహిళ ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. - 8లో



**సిద్దవటం రేంజిలో కూంబింగ్**

సిద్దవటం రేంజిలోని రోళ్లబోడు, సిద్దవటం, గొల్లపల్లె బీట్లలో కూంబింగ్ నిర్వహించినట్లు రేంజర్ ప్రసాద్ తెలిపారు. - 8లో



**డీ సెంట్ ఇల్లు**

రాష్ట్ర సర్కారు చేపట్టిన 'నవరత్నాలు-అర్హులందరికీ ఇళ్లు' పథకం అద్భుతాలు సృష్టిస్తోంది. - 8లో

## న్యూస్‌రీల్

### బదిలీలపై మాయమాటలు నమ్మవద్దు

వైవీయూ : ఉపాధ్యాయుల బదిలీల ప్రక్రియలో కొందరు మోసగాళ్లు విద్యాశాఖలో సెక్షన్ ఆఫీసర్స్ అని చెబుతూ డబ్బు అడుగుతున్నారని, వారి మాయమాటలు నమ్మవద్దని డీఈఓ వై.రాఘవరెడ్డి తెలిపారు. రాఘవులు అనే వ్యక్తి తెలంగాణ యాసలో తెలుగు మాట్లాడుతూ కమిషనర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ ఆఫీసులో సెక్షన్ ఆఫీసర్ అని చెప్పి బదిలీలు, పోస్టింగ్‌లు ఇస్తామని 8520095158 సెల్ నంబర్ ద్వారా ఫోన్ చేసి ఫోన్ పే ద్వారా డబ్బు వసూలు చేస్తున్నాడని తెలిసిందన్నారు. అలాంటి వ్యక్తి చేతుల్లో మోసపోవద్దని.. బదిలీలు, పోస్టింగ్‌లు కంప్యూటర్ సాఫ్ట్‌వేర్ ద్వారా ఆన్‌లైన్ విధానంలో జరుగుతాయన్నారు.

### అరుణాచలానికి ప్రత్యేక సర్వీసు




కడప కోటిరెడ్డిసర్కిల్ : పౌర్ణమి సందర్భంగా కడప డిపో నుంచి అరుణాచలం (తిరువన్నామలై)కు సూపర్ లగ్జరీ సర్వీసును నడపనున్నట్లు కడప డిపో మేనేజర్ డిల్లీశ్వర్‌రావు తెలిపారు. ఇందుకు సంబంధించి పెద్దలకు రూ.1050 రానుపోను ఛార్జీగా నిర్ణయించామన్నారు. ఈ సర్వీసు జూన్ 2వ తేది రాత్రి 9 గంటలకు బయలుదేరుతుందని వివరించారు. అనంతరం 3వ తేదిన అరుణాచలం నుంచి రాత్రి 8 గంటలకు అక్కడి నుంచి బయలుదేరి కడపకు చేరుతుందన్నారు. భక్తులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

# నవశకం.. నాలుగేళ్ల సంబరం

- జిల్లా వ్యాప్తంగా కేక్‌లు కట్ చేసి సంబరాలు
- పాల్గొన్న ప్రజా ప్రతినిధులు



కడప నగరంలోని హెడ్‌పోస్టాఫీసు వద్దనున్న వైఎస్‌ఆర్ విగ్రహం వద్ద నివాళి అర్పిస్తున్న డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్‌బాబు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు

కడప కార్పొరేషన్ : రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి పాలనకు నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జిల్లా వ్యాప్తంగా సంబరాలు ఉత్సాహపూరిత వాతావరణంలో జరిగాయి. కడప నగరంలోని హెడ్‌పోస్టాఫీసు ఎదుట ఉన్న వైఎస్సార్ విగ్రహానికి డిప్యూటీ సీఎం అంజద్‌బాషా, మేయర్ సురేష్ బాబులు క్షీరాభిషేకం నిర్వహించి, పూలమాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ప్రారంభించారు. అనంతరం వైఎస్సార్‌సీపీ జిల్లా కార్యాలయంలో మైదుకూరు ఎమ్మెల్యే రఘురామిరెడ్డితో కలిసి కేక్ కట్ చేసి ఒకరినొకరు తినిపించుకున్నారు. ఈ కార్యక్రమంలో ఏపీ సోషల్ వెల్ఫేర్ బోర్డు ఛైర్మన్ పులి సునీల్, డిప్యూటీ మేయర్ నిత్యానందరెడ్డి, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర కార్యదర్శి అఫ్జల్‌ఖాన్, జయచంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

- ప్రొద్దుటూరు పట్టణంలోని కూరగాయల మార్కెట్ వద్దనున్న వైఎస్సార్ విగ్రహానికి ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్‌రెడ్డి ఆధ్వర్యంలో పూలమాల వేసి, కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. అనంతరం సమావేశం నిర్వహించి అధికారంలోకి వచ్చాక అమలు చేసిన సంక్షేమ కార్యక్రమాలను వివరించారు. పద్మశాలీ కార్పొరేషన్ ఛైర్‌పర్సన్ జింకా విజయలక్ష్మి, మున్సిపల్ ఛైర్‌పర్సన్ బి. లక్ష్మిదేవి, వైస్ ఛైర్మన్ పి. బంగారు మునిరెడ్డి, కె. నాగేంద్రారెడ్డి తదితరులు పాల్గొన్నారు.
- కమలాపురంలోని నగర పంచాయితీ కార్యాలయంలో ఎమ్మెల్యే పి. రవీంద్రనాథ్‌రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ నాయకులకు పంచిపెట్టారు. అనంతరం విలేకరుల సమావేశం నిర్వహించి నాలుగేళ్లలో వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను వివరించారు.
- పులివెందుల పట్టణంలోని పురపాలక కార్యాలయంలో మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్‌ల ఆధ్వర్యంలో కేక్ కట్ చేసి అందరికీ పంచిపెట్టారు. ప్రభుత్వం అమలు చేసిన సంక్షేమ పథకాలను వివరించారు. ఈ కార్యక్రమంలో కౌన్సిలర్లు పాల్గొన్నారు.
- జమ్మలమడుగులోని ఎమ్మెల్సీ కార్యాలయంలో ఎమ్మెల్సీ పి. రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. అనంతరం కేక్ కట్ చేసి ఒకరినొకరు పంచుకున్నారు.
- వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడి నాలుగేళ్లు పూర్తయిన సందర్భంగా జమ్మలమడుగు మండంలోని పి.బొమ్మేపల్లిలో నిర్వహించిన గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో ఎమ్మెల్యే డా. సుధీర్‌రెడ్డి కేక్ కట్ చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు తినిపించారు.



ప్రొద్దుటూరులో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాద్ రెడ్డి



జమ్మలమడుగులో ఎమ్మెల్సీ రామసుబ్బారెడ్డి ఆధ్వర్యంలో సీఎం జగన్ చిత్రపటానికి పాలాభిషేకం



కమలాపురంలో కేక్ కట్ చేస్తున్న ఎమ్మెల్యే రవీంద్రనాథ్‌రెడ్డి



పులివెందులలో కేక్ కట్ చేస్తున్న వైఎస్ మనోహర్‌రెడ్డి, వరప్రసాద్ తదితరులు



రాజంపేటలో కేక్ చేస్తున్న జెడ్పీ ఛైర్మన్ ఆకేపాటి అమర్‌నాథ్‌రెడ్డి



బొమ్మేపల్లిలో కేక్ కట్‌చేస్తున్న ఎమ్మెల్యే సుధీర్‌రెడ్డి

# దేశీకి ప్రాణం.. ధరిత్రికి ప్రణామం

రసాయనిక మాయలో చిక్కుకున్న సమాజానికి సాంప్రదాయ సాగుతో కాయకల్ప చికిత్స జరుగుతోంది. సహజాహార ఉత్పత్తుల యజ్ఞం కర్షకుల స్వేదంతో ప్రజ్వలిల్లుతోంది. వ్యవసాయ, ఉద్యాన రంగంలో ఆధిపత్యం చెలాయిస్తున్న హైబ్రీడ్ విత్తనాలకు ప్రత్యామ్నాయంగా దేశీయ వంగడం పునఃప్రాణం పోసుకుంటోంది. సాంప్రదాయ వంగడాల తయారీతో పాటు ప్రయోగాత్మకంగా పంటలను సేంద్రియ పద్ధతిలో సాగు చేస్తూ.. అన్నమయ్య జిల్లా వాల్మీకిపురం మండలం అయ్యవారి పల్లెకు చెందిన రైతులు ఔరా!అనిపిస్తున్నారు.

- 'దేశీకి ప్రాణం.. ధరిత్రికి ప్రణామం
- అయ్యవారి పల్లెలో దేశీయ వంగడాల పరిమళం
- ప్రకృతి సేద్యంతో ప్రయోగం
- దాదాపు పది రకాల విత్తనాల తయారీ
- తక్కువ ఖర్చుతో పాటు అధిక దిగుబడులు, ఆదాయం

సాక్షి, కడప డెస్క్ : దేశీయ విత్తనాలు మొదలు వంగడాలు, పంటల సాగుకు సేంద్రీయ పద్ధతుల్లో తయారు చేసిన ఎరువులనే వినియోగిస్తూ రైతులు ప్రకృతికి ప్రణామం చేస్తున్నారు. హైబ్రీడ్ రకాలకు దీటుగా బ్లాక్‌రైస్, నల్ల, పసుపు రంగు కార్యెట్లు, వంగపూత రంగు బీన్స్, రంగురంగుల మిరప, టమాటాల సాగుకు అవసరమైన దేశీయరకం విత్తనాలను సృష్టిస్తున్నారు. ఇలాంటి పంటలే ఈశాన్య రాష్ట్రాలైన అస్సాం, నాగాలాండ్, మిజోరం, త్రిపుర, సిక్కింలో సాగవుతుండటం విశేషం.

**2016లో శ్రీకారం :** అయ్యవారిపల్లెకు చెందిన కొందరు రైతులు కర్ణాటక, తెలంగాణ, మైసూర్ ప్రాంతాల నుంచి మొదటగా వరిలో దేశీయ రకం.. అందులో కొత్త రకాలైన బ్లాక్‌రైస్, పంచరత్న, నవారాల వడ్లను తెచ్చి పంటల సాగు చేశారు. సాధారణ వరి పైరు మూడు అడుగుల మేరకు ఎత్తు పెరుగుతుంది. దేశీయ రకం వరి పైరు 8.5 అడుగుల ఎత్తు పెరిగి ఎకరానికి 30 బస్తాల దిగుబడి వస్తుంది. మంచి దిగుబడితోపాటు సాధారణ బియ్యం కంటే భిన్నంగా మూడురెట్ల అధిక ఆదాయం వస్తుంది. వీటిని మార్కెట్‌కు తరలించకుండా విత్తనాలుగా మార్చి పరిసర ప్రాంతాల రైతులకు విక్రయిస్తున్నారు.

**కూరగాయల్లో కొత్త రకాలు :**

గత మూడేళ్లుగా కూరగాయల్లోనూ దేశీయ రకం కొత్త వంగడాలపై దృష్టిసారిస్తున్నారు. తొలుత వివిధ ప్రదేశాల నుంచి కొత్త విత్తనాలను తీసుకొచ్చి.. ప్రయోగాత్మకంగా సాగు చేసిన అనంతరం వాటి ఫలితాలను బట్టి దేశీ వంగడాల నారులు పోస్తున్నారు. ముఖ్యంగా టమాటా, బ్లాక్ క్యారెట్, పసుపురంగు క్యారెట్, వంగపూత కలర్‌బీన్స్, విభిన్న రంగుల మిరపకాయలు, బత్తాయి, వంగ, చిక్కుడు రకాల దేశీయ విత్తనాలను అందుబాటులోకి తీసుకొస్తున్నారు.



ఎనిమిది అడుగుల మేరకు పెరిగిన పంచరత్న వరి పైరు



మూడు రకాలుగా ఉన్న కొత్తరకం దేశీయ టమాటా



ఆకర్షణీయమైన రంగుల్లో కొత్తరకం మిరపకాయలు



పసుపురంగులో ఉన్న క్యారెట్

**➡ స్వదేశీ రకాలతో సంపూర్ణ పోషకాలు**

బ్లాక్ రైస్, పంచరత్న, నవారా రకం బియ్యం సాధారణ బియ్యం కంటే భిన్నమైన రంగు కలిగి ఉంటాయి. పరిమాణంలో వ్యత్యాసం ఉంటుంది. ఈ రకాల పంటలు నాలుగు నెలల కాలంలోనే దిగుబడి ఇస్తాయి. రంగుతో పాటు సాధారణ బియ్యం కంటే వీటిలో అధిక పోషకాలు, విటమిన్లు సమృద్ధిగా ఉంటాయి. మార్కెట్‌లో ఈరకం బియ్యానికి ఎక్కువ డిమాండ్ ఉంది. బయట కిలో బ్లాక్‌రైస్ రూ.300, పంచరత్న బియ్యం రూ.120 వరకు ధర పలుకుతోంది. దేశీయ రకం కూరగాయల కొత్త వంగడాల్లో పంట సాగుకు సాధారణ పంటలకు అయ్యే ఖర్చు అవుతుందని వ్యవసాయ, ఉద్యాన శాస్త్రవేత్తలు, అధికారులు చెబుతున్నారు. హైబ్రీడ్ రకాలతో పోలిస్తే వీటిలో అధిక పోషకాలు ఉన్నాయని అవగాహన కల్పిస్తున్నారు.

**గుమ్మడి కాయ టమాటా :**

దేశీయ రకంలోనే రైతుల హైబ్రీడ్‌ను పోలిన రంగుల కూరగాయలను పండిస్తుండటం విశేషం. క్యారెట్ ఎరుపురంగులో ఉంటే ఇక్కడి క్యారెట్ కోస్తే నలుపు, పసుపు వర్ణాల్లో కనిపిస్తుంది. దేశీయ రకం కొత్త వంగడాల్లో ఒకే టమాటాలో పసుపు,ఎరుపు, వంగపూత రంగులు ఉంటున్నాయి. ఇక్కడి బీన్స్ ఆకుపచ్చ రంగులో కాకుండా వంగపూత, పర్పుల్ వర్ణాల్లో ఆకర్షణీయంగా కనిపిస్తున్నాయి. మిర్చిలో అయితే గులాబి, వంగపూత రంగులతో పాటు ఇంకా ఏడు రంగులు కలిసి ఉన్న కాయలు పండిస్తుండటం ఇక్కడి ప్రత్యేకత. మిర్చిలోనే లైలాలుంగీ, ఫ్లైయింగ్ సాచూర్, గాంధారీ, చంద్‌మెన్సూ రకాలను మైసూర్ చుట్టుపక్కల ప్రాంతాల నుంచి దిగుమతి చేసుకొని సాగు చేస్తున్నారు.

**స్వయంగా సేంద్రీయ ఎరువుల తయారీ**

దేశీయ రకం వరి వంగడాల పంటలన్నీ సేంద్రియ ఎరువులతోనే సాగు చేస్తున్నారు. పూర్తి స్థాయిలో సేంద్రీయ ఎరువులను భూమిలో కలియదున్ని విత్తనాలు వేస్తున్నారు. సహజ సిద్ధంగా లభించే కొన్నిరకాల ఆకులు, ఆవు పేడ, మూత్రం, వేపాకులతోనే సేంద్రియ ఎరువులను రైతులే స్వయంగా తయారు చేసుకుంటున్నారు. పంటలకు సోకే తెగుళ్ల నివారణకు, పంటల అధిక దిగుబడులకు వీటినే వినియోగిస్తున్నారు.

**కిచెన్ గార్డెన్లలోనూ..**

రైతులతో పాటు ఔత్సాహికులు తమ ఇళ్ల పరిసరాల్లోని కిచెన్ గార్డెన్‌లలో కూడా దేశీయ వంగడాలను సాగు చేస్తున్నారు. అయ్యవారి పల్లెకు వచ్చి ఇక్కడ దేశీయ రకం కొత్త వంగడాలు, విత్తనాలు కొనుగోలు చేసి తమ ఊళ్లకు తీసుకెళ్లి పెరట్లో వేసుకుంటున్నారు.

**అధిక దిగుబడితో మంచి ఆదాయం**



కొత్తరకం దేశీయ వంగడాల కూరగాయల సాగుతో అధిక దిగుబడి, మంచి ఆదాయం వస్తుంది. సాధారణ కూరగాయల పంటల సాగుకు అయ్యే ఖర్చుకంటే కుడా వీటి సాగుకు తక్కువ ఖర్చు ఉంటుంది. రెండెకరాల సాగుతో విత్తనాలు తయారు చేయడమే కాకుండా మార్కెట్లో మంచి ధరలకు కూరగాయలను విక్రయించాను. ఎకరం మిర్చికి కనీసం రూ. 2లక్షల ఆదాయం వస్తుంది.

– చెంగల్రాయలు, రైతు, అయ్యవారిపల్లె

**విత్తనాలు తయారు చేస్తాం**



దేశీయరకం కూరగాయలు, క్యారెట్ల పంటలు సాగు చేసి వాటి విత్తనాలను తయారు చేస్తాం. బ్లాక్, ఎల్లో రకం క్యారెట్లు, బీన్స్‌తో పాటు ఇతర రకాల కూరగాయల విత్తనాలను స్వయంగా తయారు చేస్తాం. వీటిని ఇతర ప్రాంతాల రైతులకు సరఫరా చేస్తాం. చాలా మంది వారి పెరట్లో సాగు చేసుకొనేందుకు మా దగ్గర విత్తనాలు తీసుకెళ్తుంటారు.

– రాజారెడ్డి, రైతు, అయ్యవారిపల్లె

## ఖేలోఇండియాలో వైవీయూ క్రీడాకారులకు పతకాలు

వైవీయూ : ఉత్తరప్రదేశ్ రాష్ట్రంలోని గౌతమ బుద్ధనగర్‌లోని గౌతమబుద్ధ విశ్వవిద్యాలయంలో నిర్వహిస్తున్న ఖేలోఇండియా పోటీల్లో కడప యోగివేమన విశ్వవిద్యాలయం క్రీడాకారిణి జాతీయస్థాయిలో రాణించి పతకం కైవసం చేసుకుంది. వెయిట్‌లిఫ్టింగ్ సీనియర్ మహిళల విభాగంలో వైవీయూ పరిధిలోని జమ్మలమడుగు సాయిపరమేశ్వర డిగ్రీ కళాశాల బీఏ ప్రథమ సంవత్సరం విద్యార్థిని బెర్నాలీ బోరాకు 49 కేజీల విభాగంలో మూడో స్థానంలో నిలిచి కాంస్యపతకం సాధించింది.

అదే విధంగా అథ్లెటిక్స్ పోటీల్లో వైవీయూ నుంచి ప్రాతినిథ్యం వహించిన షేక్ మోహిద్దీన్ హైజంప్‌లో 2.06 మీటర్లలో కాంస్యపతకం సాధించారు. కాగా ఈయన బద్వేలు ఎస్.బి.వి.ఆర్. డిగ్రీ కళాశాలలు చదువుతున్నాడు. విశ్వవిద్యాలయ విద్యార్థుల ప్రతిభపై వైవీయూ వీసీ చింతా సుధాకర్, రిజిస్ట్రార్ వై.పి. వెంకటసుబ్బయ్య, ప్రిన్సిపాల్ ఆచార్య కె. కృష్ణారెడ్డి, క్రీడాబోర్డు కార్యదర్శి డా. కె. రామసుబ్బారెడ్డి అభినందనలు తెలిపారు.





కాంస్యపతకం సాధించిన వైవీయూ క్రీడాకారిణి బెర్నాలీ బోరాకు, షేక్ మొహిద్దీన్

## బంగరు భవితకు బాటలు వేసుకోవాలి

ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



బాలబాలికలతో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్

కడప అర్బన్ : బాగా చదివి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకుని అత్యున్నత స్థాయికి ఎదగాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ ఆకాంక్షించారు. మంగళవారం కడప నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్‌హాల్‌లో బడి మానేసిన 24 మంది బాలబాలికలను మహిళా పోలీసులు గుర్తించి వారికి కౌన్సెలింగ్ నిర్వహించారు. తిరిగి బడిబాట పట్టేలా కృషి చేశారు. ఆయా బాలబాలికలందరికీ ఎస్పీ ప్రోత్సాహకంగా బహుమతులను అందజేసి వారిలో స్ఫూర్తిని నింపారు. ఈ సందర్భంగా ఎస్పీ చిన్నారులతో ముచ్చటించారు. వారి లక్ష్యాలను అడిగి తెలుసుకున్నారు. లక్ష్యాలను చేరుకునేందుకు బాగా చదవాలనీ, మీ తల్లిదండ్రులతో పాటు పోలీసుశాఖ అండగా ఉంటుందనీ భరోసా ఇచ్చారు. జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, 'దిశ' డీఎస్పీ ఎస్. రమాకాంత్, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్ఐలు, మహిళా పోలీసులు పాల్గొన్నారు.

## అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలి

మోడల్ టౌన్ అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష



మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ విజయరామరాజు

పులివెందుల రూరల్ : పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న అభివృద్ధి పనులలో పురోగతి సాధించాలని జిల్లా కలెక్టర్ విజయరామరాజు పేర్కొన్నారు. మంగళవారం సాయంత్రం స్థానిక ఆర్‌అండ్‌బీ అతిథి గృహంలో అన్ని శాఖల అధికారులతో సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పులివెందుల మోడల్ టౌన్‌లో భాగంగా జరుగుతున్న సిటీ సెంటర్, ఇంటర్నల్ రోడ్స్, శ్లాటర్న్ హౌస్ నిర్మాణ పనులు, స్పోర్ట్స్ కాంప్లెక్స్, హాకీ అకాడమి, గరండాల్, నగర వనం, నైపుణ్యాభివృద్ధి సంస్థ పనులను వేగవంతంగా పూర్తి చేయాలన్నారు. జూన్ 10 నాటికి పనులు పూర్తయ్యే విధంగా చూడాలని అధికారులను ఆదేశించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్ రెడ్డి మోడల్ టౌన్‌పై ప్రత్యేక దృష్టి సారించారని.. అందువల్ల అధికారులు, కాంట్రాక్టర్లు ప్రత్యేక దృష్టి పెట్టి పులివెందుల మోడల్ టౌన్ అభివృద్ధి పనులను త్వరగా పూర్తి చేయాలన్నారు. జులై 8వ తేదీన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి పులివెందుల పర్యటనకు వచ్చే అవకాశం ఉందని.. అలోగా అభివృద్ధి పనులన్నింటినీ పూర్తి చేసి ప్రారంభానికి సిద్ధంగా ఉంచాలన్నారు. కార్యక్రమంలో పాడా ఓఎస్డీ అనిల్‌కుమార్‌రెడ్డి, మున్సిపల్ ఇన్‌చార్జి వైఎస్ మనోహర్‌రెడ్డి, మున్సిపల్ ఛైర్మన్ వరప్రసాద్, ఆర్డీఓ వెంకటేశులు, డీఎఫ్ఓ సందీప్, తహసీల్దార్ మాధవ కృష్ణారెడ్డి, మున్సిపల్ కమిషనర్ నరసింహారెడ్డి పాల్గొన్నారు.

## సచివాలయాల్లో 1005 ఖాళీలు

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని గ్రామ, వార్డు సచివాలయాల్లో వివిధ కేటగిరీల్లో 1005 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఇందులో గ్రామీణ ప్రాంతాల్లో 875, కడప కార్పొరేషన్, ప్రొద్దుటూరు, పులివెందుల, రాయచోటి, జమ్మలమడుగు, రాజంపేట, బద్వేలు, మైదుకూరు, ఎర్రగుంట్ల అర్బన్ పరిధిలో 130 పోస్టులున్నాయి. రూరల్‌లో హార్టికల్చర్ అసిస్టెంట్లు 116, ఇంజినీరింగ్ అసిస్టెంట్లు 66, ఫిషరీస్ అసిస్టెంట్లు 2, మహిళా సంరక్షణ కార్యదర్శులు 46, పంచాయతీ సెక్రటరీలు (గ్రేడ్- 5) 36, డిజిటల్ అసిస్టెంట్లు (గ్రేడ్-6) 43, సెరికల్చర్ అసిస్టెంట్ 1, వెటర్నరీ అసిస్టెంట్లు 426, అగ్రికల్చర్ అసిస్టెంట్లు 15, వీఆర్వో/డబ్ల్యుఆర్ఎస్ పోస్టులు 78, గ్రేడ్-3 సర్వేయర్లు 15, వెల్ఫేర్ అండ్ ఎడ్యుకేషన్ అసిస్టెంట్లు 31 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. అర్బన్ ఏరియాలో వార్డు సెక్రటరీలు 28, ఎడ్యుకేషన్ అండ్ డేటా ప్రాసెసింగ్ సెక్రటరీలు 14, శానిటేషన్ అండ్ ఎన్విరాన్‌మెంట్ సెక్రటరీలు 24, వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సెక్రటరీలు 6, ఎమినిటీస్ సెక్రటరీలు 34, ప్లానింగ్ అండ్ రెగ్యులేషన్ సెక్రటరీలు 24 పోస్టులు ఖాళీగా ఉన్నాయి. ఖాళీల వివరాలను కడప.జీఓవీ.ఇన్ అనే వెబ్‌సైట్‌లో పొందుపరిచామని జిల్లా పరిషత్ ముఖ్య కార్యనిర్వహణాధికారి సుధాకర్‌రెడ్డి తెలిపారు. బదిలీల కోసం దరఖాస్తు చేసుకునే సిబ్బంది ఖాళీల వివరాలను పైన తెలిపిన వెబ్‌సైట్‌లో చూసుకోవాలని తెలిపారు.

## లింగ నిర్ధారణ చేయవద్దు

కడప రూరల్ : స్కానింగ్ సెంటర్ల నిర్వాహకులు లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే కఠిన శిక్షలు తప్పవని జిల్లా వైద్య ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. పీసీ అండ్ పీఎన్‌డీటీ యాక్ట్‌పై మంగళవారం జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో గర్భస్థ పిండ లింగ నిర్ధారణ చట్టంపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా డీఎంహెచ్ఓ జిల్లా వ్యాప్తంగా ఉన్న స్కానింగ్ సెంటర్లు, అబార్షన్‌లు ఎక్కువగా జరుగుతున్న ప్రైవేట్ ఆసుపత్రుల వివరాలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఆడ, మగ ఎవరైనా ఒకటే అని అవగాహన కల్పించాలన్నారు. ఎవరైనా సరే లింగ నిర్ధారణ పరీక్షలు నిర్వహిస్తే ఐదేళ్ల జైలు శిక్షతో పాటు రూ.10 వేల నుంచి రూ.లక్ష వరకు జరిమానా ఉంటుందని తెలిపారు. ఈ కార్యక్రమంలో కన్వీనర్ డాక్టర్ ఉమామహేశ్వరకుమార్, వైద్యులు మల్లేశ్వరి, వెంకటచంద్రారెడ్డి, ప్రమోద, బాలక్రిష్ణ, డేవిడ్ చక్రవర్తి తదితరులు పాల్గొన్నారు.



# డీసెంట్ ఇళ్లు

పేదల సొంతింటి కల సాకారమవుతోంది.
రాష్ట్ర సర్కారు చేపట్టిన
'నవరత్నాలు- అర్హులందరికీ ఇళ్లు'
పథకం అద్భుతాలు సృష్టిస్తోంది.
ఇళ్లు కాదు.. ఏకంగా ఊర్లు పుట్టుకొస్తున్నాయి.
ప్రభుత్వం ఒక సెంటు స్థలం ఇచ్చినా..
లబ్ధిదారులు అందులో చూడచక్కనైన
ఇల్లు నిర్మించుకుంటున్నారు.
ఇళ్లు నిర్మిస్తున్న తీరు, అందులో ఏర్పాటు చేసుకుం
టున్న వసతులను చూస్తే
నిజంగా ముచ్చటేస్తుంది.
కడప నగరంలోని వైఎస్సార్ జగనన్న కాలనీల్లో ఈ
దృశ్యాలు కనిపించాయి.
(సెంటు స్థలంలో సమాధులు తప్ప,
మరేం నిర్మించలేమని ప్రతిపక్షనేత చంద్రబాబు
వ్యాఖ్యానించడంపై పేదలు ఆగ్రహం వ్యక్తం
చేస్తున్నారు. ఈ అందమైన లోగిళ్లను చూస్తే ప్రతి
పక్షాలు నోరెళ్లబెట్టక తప్పదు.)

–సాక్షి ఫొటోగ్రాఫర్











**బ్యాంక్ ఆఫ్ బరోడా**
Bank of Baroda
హాస్పటల్ రోడ్డు కడప శాఖ
డోర్ నెం.21/368-సి, పాత రిమ్స్ హాస్పటల్ రోడ్, కడప-516001.

**డిమాండ్ నోటీసు**

(సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002లోని సెక్షన్ 13(2) లోని చాప్టర్ 3 క్రింద - జారీ చేయబడిన నోటీసు)

ఋణగ్రహీత : మెస్సర్స్ సూర్య ఎంటర్‌ప్రైజెస్,
ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రైటర్ : శ్రీమతి వి. శివ మంజుల,
డి.నెం.101/115, విశ్వనాథపురం, ఊటుకూర్, చింతకొమ్మ దిన్నె మండలం, వైఎస్సార్ జిల్లా.
హామీదారులు/తనఖాదారులు : 1) శ్రీ వరం బేష్ కుమార్, తండ్రి : వి. సుబ్బారాయుడు,
డి.నెం.101/115, విశ్వనాథపురం, ఊటుకూర్, చింతకొమ్మ దిన్నె మండలం, వైఎస్సార్ జిల్లా, కడప-516001.
2) శ్రీ వరం సుబ్బారాయుడు, తండ్రి : లేటు వరం సుబ్బయ్య
డి.నెం.101/115, విశ్వనాథపురం, ఊటుకూర్, చింతకొమ్మ దిన్నె మండలం, వైఎస్సార్ జిల్లా, కడప-516001.
3) శ్రీమతి వరం శోభావతి, భర్త : లేటు నాగదాసరి వెంకట రామయ్య
డి.నెం.16/1305, మాసాపేట, మచ్చుపల్లి బస్టాండ్ దగ్గర, వైఎస్సార్ జిల్లా, కడప-516001.

విషయం : బ్యాంక్ ఆఫ్ బరోడా మా హాస్పటల్ రోడ్ కడప బ్రాంచ్ (ఋణుపటి విజయా బ్యాంక్) తో మెస్సర్స్ సూర్య ఎంటర్‌ప్రైజెస్ వారి క్రెడిట్ సౌకర్యాలు గురించి

సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ ఎసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం 2002 యొక్క చాప్టర్-3 యొక్క సెక్షన్ 13(2) ప్రకారం దిగువ సంతకందారు రిజిస్టర్డ్ పోస్ట్ ద్వారా **తేది.04-05-2023** న మీకు తిరుగు రశీదులతో కూడిన **డిమాండ్ నోటీసు** మీచే పొందుపరచబడిన చిరునామాకు జారీచేయడమైనది. మీరు చిరునామాలో లేనందున తపాల శాఖ వారిచే బ్రాంచికు తిరుగు వచ్చినందున ఈ పత్రికా ప్రకటన ద్వారా సదరు నోటీసు ప్రచురించబడినది. సదరు నోటీసు యొక్క వివరము దిగువ తెలుపబడినది. మీ యొక్క లోన్ ఖాతా బకాయిలు సరిగా చెల్లించనందున సదరు అకౌంట్ **తేది.01-09-2022** నుండి నిరర్ధక ఆస్తిగా (ఎన్.పి.ఎ) పరిగణించబడినది. ఈ నోటీసు ప్రచురణ తేది నుండి 60 రోజులలోగా మీరు బకాయి మొత్తము **తేది.04-05-2023 నాటికి రూ.22,21,794.47 పై (అక్షరాల ఇరవై రెండు లక్షల ఇరవై ఒక్క వేల ఏడు వందల తొంభై నాలుగు రూపాయల నలభై ఏడు పైసలు మాత్రమే)** మరియు ఒప్పందపూర్వక తదుపరి జమకూడు వడ్డీ, ఛార్జీలు, ఇతర ఖర్చులు, మొదలగునవి మీరు చెల్లింపు చేయు తేది వరకు **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారికి చెల్లించవలెను. పైన చెప్పిన సదరు చట్టంలోని సెక్షన్ 13(13) నియమానుసారం సెక్యూరిటీగా ఉంచిన ఆస్తులకు సంబంధించి **బ్యాంక్ ఆఫ్ బరోడా** వారి ముందస్తు అనుమతి లేకుండా ఎలాంటి అమ్మకము, లీజు లేదా ఇతరత్రా లావాదేవీలు (సాధారణ వ్యాపార అవసరాలు తప్ప) ద్వారా బదిలీ చేయుట నిషేధించబడతాయని మీరు గమనించవలెను. ఈ నోటీసు సదరు చట్టంలోని సెక్షన్ 13(2) నిబంధనల ప్రకారం జారీచేయబడినది.

**తనఖా ఉంచిన స్థిరాస్తి వివరములు**

వైఎస్సార్ జిల్లా-516001, కడప, చిన్నచౌక్ గ్రామం, ఇండస్ట్రియల్ ఎస్టేట్ ఎస్.నెం.902/1, APIICI, సమాన నిష్పత్తిలో తనఖా ఉంచిన షెడ్ నెం.E-14, ఆస్తి (**రిజిస్టర్ అమ్మకపు దస్తావేజు నెం.2163/2005** ప్రకారం) మెస్సర్స్ భరత్ ఇంజనీరింగ్ వర్క్స్, ప్రాతినిధ్యం వహిస్తున్న ప్రొప్రయిటర్ : వి.సుబ్బారాయుడు, తండ్రి : వి. సుబ్బయ్య గారి పేరున ఉన్నది
హద్దులు : తూర్పు : M L E షెడ్ నెం.6, పడమర : ప్రభుత్వ భూమి, ఉత్తరం : 20 అడుగుల వెడల్పు గల W.B.M రోడ్, దక్షిణం : మెస్సర్స్ లక్ష్మీ వినయ్ పాలి ప్రింట్ ప్యాక్ ప్రైవేట్ లిమిటెడ్ వారికి చెందిన షెడ్ నెం.E-14.

ప్రదేశం : కడప
తేది : 04.05.2023
సం/- అధీకృత అధికారి,
బ్యాంక్ ఆఫ్ బరోడా, హాస్పటల్ రోడ్డు కడప శాఖ

## గంగమ్మ హుండీ ఆదాయం లెక్కింపు

**లక్కిరెడ్డిపల్లి :** మండలంలోని అనంతపురం గ్రామంలో వెలసిన శ్రీ అనంతపురం గంగమ్మతల్లి హుండీని మంగళవారం ఆలయ కమిటీ నిర్వాహకులు, దేవదాయ శాఖ సిబ్బందితో కలిసి లెక్కించారు. హుండీ ఆదాయం రూ. 2,44,760 వచ్చినట్లు ఆలయ కార్యనిర్వహణ అధికారి రవీంద్రరాజు తెలిపారు. దేవదాయ, ధర్మాదాయశాఖ ఇన్‌స్పెక్టర్ జనార్దన్ ఆలయ కమిటీ సభ్యుల ఆధ్వర్యంలో హుండీ లెక్కింపు చేశారు. రెండు నెలలకు ఈ ఆదాయం వచ్చినట్లు ఈఓ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆలయ చైర్మన్ సామాల నరసింహారెడ్డి, ఆంధ్రప్రగతి గ్రామీణ బ్యాంక్ ఫీల్డ్ ఆఫీసర్ చంద్రబాబు, ఆలయ కమిటీ సభ్యులు సుబ్బారాయుడు, ఈశ్వరయ్య, గోవిందాచారి, ఆలయ పూజారి ఆదిమూలం రెడ్డిశేఖర్ తదితరులు పాల్గొన్నారు.

## సిద్దవటం రేంజ్‌లో కూంబింగ్

**సిద్దవటం :** సిద్దవటం రేంజ్‌లోని రోళ్ళబోడు, సిద్దవటం, గొల్లపల్లె బీట్లలోని అత్యంత సమస్యాత్మకమైన ప్రదేశాల్లో కడప ఫ్లయింగ్ స్క్వాడ్, సిద్దవటం అటవీశాఖ అధికార సిబ్బంది కూబింగ్ నిర్వహించినట్లు రేంజర్ ప్రసాద్ తెలిపారు. ఆయన మంగళవారం విలేకరులతో మాట్లాడుతూ సిద్దవటం రేంజ్‌లోని సవర్లబావి, పెంటబావి, చెంచల చెలిమి, సాకిరేవులు, ఉప్పుగుంతలు వంటి అటవీ ప్రదేశాల్లో కూంబింగ్ ముమ్మరంగా నిర్వహించినట్లు పేర్కొన్నారు. ఎలాంటి స్మగ్లర్ల జాడ గానీ, ఎర్రచందనం దుంగలు గానీ కనిపించలేదన్నారు. ఈ కార్యక్రమంలో కడప ఫ్లయింగ్ స్క్వాడ్ ఫారెస్టు సెక్షన్ ఆఫీసర్ నాగరాజు, ఎఫ్‌బీఓ శ్రీనివాసులు, సిద్దవటం రేంజర్ డిప్యూటీ రేంజర్ కె.ఓబులేస్, ఎఫ్‌బీఓలు రాజశేఖర్‌రెడ్డి, విశ్వనాథ్, సాబ్‌బావి బేస్ క్యాంప్ సిబ్బంది, స్ట్రైకింగ్ ఫోర్స్ సిబ్బంది పాల్గొన్నారు.

## తహసీల్దార్ కార్యాలయం పరిశీలన

**సిద్దవటం :** సిద్దవటంలోని తహసీల్దారు కార్యాలయంలో జరుగుతున్న మరమ్మతు పనులను జాయింట్ కలెక్టర్ గణేష్‌కుమార్, ఆర్డీఓ ధర్మచంద్రారెడ్డి మంగళవారం పరిశీలించారు. ఈ సందర్భంగా వారు కార్యాలయంలో మరమ్మతు పనులు చేయడంతో కార్యాలయం ఇప్పుడు చాలా బాగుందని సంతృప్తి వ్యక్తం చేశారు. అలాగే ఆఫీస్‌లో రికార్డు రూమును పరిశీలించారు. బయట కాంపౌండులో పనులను త్వరితగతిన పూర్తి చేయాలని, రక్షణగోడ దగ్గర దుకాణాదారులను ఎవరినీ కూడా బంకులను పెట్టనీయవద్దని తహసీల్దారుకు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో తహసీల్దారు శంకర్‌రావు, డిప్యూటీ తహసీల్దారు రాజేష్‌క్రిష్ణ, కార్యాలయ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

# పెండింగ్ కేసులు త్వరితగతిన పరిష్కరించాలి



నేర సమీక్షలో మాట్లాడుతున్న జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్



సమావేశంలో పాల్గొన్న పోలీసు అధికారులు, సిబ్బంది

**నేర సమీక్షలో జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్**

**కడప అర్బన్ :** జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్‌లలో నమోదైన పెండింగ్ కేసులను త్వరితగతిన పరిష్కరించాలని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ పోలీసు అధికారులను ఆదేశించారు. మంగళవారం కడప నగరంలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలతో నేర సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ అతి తీవ్రమైన నేరాలలో త్వరగా దర్యాప్తు పూర్తి చేసి నిందితులపై చార్జ్‌షీట్ దాఖలు చేయాలన్నారు. రోడ్డు ప్రమాదాలు చోటు చేసుకునే ప్రాంతాల్లో వాహనదారులను అప్రమత్తం చేస్తూ సైన్ బోర్డులు ఏర్పాటు చేయాలని ఆదేశించారు. మహిళలపై నేరాలు, రాబరీ, డకాయిట్ కేసుల్లో దర్యాప్తు వేగవంతం చేయాలన్నారు. ఫోక్సో, మహిళలపై జరిగిన నేరాలపై నిర్ణీత సమయంలో చార్జ్‌షీట్ దాఖలు చేయాలని ఆదేశించారు. మహిళలు, అదృశ్యం కేసుల్లో సమగ్ర విచారణ జరిపి అదృశ్యమైన వారి ఆచూకీ త్వరగా తెలుసుకోవాలన్నారు. గంజాయి, రవాణా, విక్రయాలపై ఉక్కుపాదం మోపాలని పోలీసు అధికారులను ఆదేశించారు. జిల్లాను నాటుసారా రహిత జిల్లాగా మార్చేందుకు అన్ని చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో అధికారులతో కలిసి సంయుక్తంగా దాడులు నిర్వహించాలన్నారు. ఎర్రచందనం అక్రమ రవాణా నిరోధానికి పకడ్బందీ చర్యలు చేపట్టడంతోపాటు నిఘా పెంచాలన్నారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్, జూదం తదితర అసాంఘిక కార్యకలాపాలపై ఉక్కుపాదం మోపాలన్నారు. దేశీ అక్రమమద్యం, ఇసుక అక్రమ రవాణాపై దాడులను ముమ్మరం చేయాలని పేర్కొన్నారు. ఎస్.హెచ్.ఆర్.సి, ఎన్.హెచ్.ఆర్.సి ఫిర్యాదులపై తక్షణం స్పందించాలని పోలీసు అధికారులను జిల్లా ఎస్పీ ఆదేశించారు. ఈ సమావేశంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్ డూడీ, ఏఆర్ అదనపు ఎస్పీ ఎస్.ఎస్.ఎస్.వి కృష్ణారావు, స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సూపరింటెండెంట్ ఎస్. శ్రీనివాస్, జిల్లా పోలీస్ కార్యాలయం ఏఓ జ్యోతి, జిల్లాలోని డీఎస్పీలు, సీఐలు, ఎస్‌ఐలు పాల్గొన్నారు.

**మహిళా పోలీసుల సేవలు అభినందనీయం**

■ పోలీసు అధికారులు, మహిళా పోలీసుల సేవలు అభినందనీయమని జిల్లా ఎస్పీ కేకేఎన్ అన్బురాజన్ తెలిపారు. జిల్లా పోలీసుశాఖకు అనుబంధంగా విధులను నిర్వహిస్తూ ఉత్తమ సేవలను అందిస్తున్న మహిళా పోలీసులకు ఆయన మంగళవారం ప్రశంసా పత్రాలను అందజేశారు. మంగళవారం కడపలోని 'పెన్నార్' పోలీస్ కాన్ఫరెన్స్ హాల్‌లో ఇటీవలి కాలంలో విధుల్లో అత్యుత్తమ పనితీరు కనపరిచిన 50 మంది మహిళా పోలీసులను అభినందించి ప్రశంసా పత్రాలు అందజేశారు.

■ జిల్లాలో ఇటీవల కాలంలో పలు కేసుల్లో నిందితులకు శిక్ష విధించిన కేసుల్లో కృషి చేసి పోలీసు అధికారులు, సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసాపత్రాలను అందజేసి అభినందించారు.

■ అలాగే తమ విధుల ద్వారా నేరాల నియంత్రణకు పాటుపడిన కమాండ్ అండ్ కంట్రోల్ సిబ్బందికి జిల్లా ఎస్పీ ప్రశంసా పత్రాలను అందజేసి వారిని ప్రత్యేకంగా అభినందించారు.

■ స్పెషల్ బ్రాంచ్ సిబ్బందికి, కడపలో ట్రాఫిక్ విధులను నిర్వహిస్తున్న పోలీసులను జిల్లా ఎస్పీ మెచ్చుకున్నారు. వారికి ప్రశంసా పత్రాలను అందజేసి అభినందించారు.

■ ఈ కార్యక్రమంలో జిల్లా అదనపు ఎస్పీ (అడ్మిన్) తుషార్‌డూడీ, స్పెషల్ బ్రాంచ్ ఇన్‌స్పెక్టర్స్ యు.వెంకటకుమార్, రాజా ప్రభాకర్, పోలీసు అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.



## వివాహిత ఆత్మహత్య



మృతి చెందిన మంజుల

**ఎర్రగుంట్ల :** ఎర్రగుంట్ల పట్టణ పరిధిలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న కొప్పోలి మంజుల (42) అనే వివాహిత భర్తతో గొడవ పడి వంకలో దూకి ఆత్మహత్య చేసుకుందని ఎర్రగుంట్ల ఎస్‌ఐ ప్రవీణ్‌కుమార్ తెలిపారు. ఆయన తెలిపిన వివరాల మేరకు.. ఎర్రగుంట్ల పట్టణంలోని ప్రకాశ్‌నగర్ కాలనీలో నివాసం ఉంటున్న శివయ్య, మంజుల అనే దంపతులు ఇద్దరు ఇంటిలో గొడవ పడ్డారు. దీంతో మంజుల తురకపల్లి గ్రామానికి మండలంలోని వై కొడూరు గ్రామానికి సరిహద్దులో ఉన్న పొలాల్లో ఉండే వంక గుంతలో దూకి ఆత్మహత్య చేసుకుంది. సంఘటన స్థలానికి పోలీసులు చేరుకుని మృత దేహాన్ని బయటకు తీసి ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి పోస్టుమార్టం నిమిత్తం తరలించారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్‌ఐ తెలిపారు.

## రైలు నుంచి జారి పడి వ్యక్తి మృతి



మృతి చెందిన టి.సందీప్

**కొండాపురం :** కొండాపురం పరిధిలోని గండికోట ఎత్తిపోతల పథకం పంప్‌హౌస్ సమీపంలో రాయలసీమ ఎక్స్‌ప్రెస్ రైలు నుంచి సోమవారం అర్ధరాత్రి సమయంలో ఓ వ్యక్తి జారి కింద పడి మృతి చెందాడు. రైల్వే పోలీసులు మంగళవారం సంఘటన స్థలాన్ని పరిశీలించారు. కర్నూలు జిల్లా ఆదోని పట్టణానికి చెందిన తప్పేట సందీప్ (30) నెల్లూరు శ్రీసిటిలో డీజిల్ మెజానిక్‌గా ఉద్యోగంలో చేరాడు. తిరిగి తన సొంత ఊరికి తిరుపతి నుంచి రాయలసీమ ఎక్స్‌ప్రెస్‌లో వెళ్తూ డోర్ వద్ద కూర్చున్నాడు. రైల్వే కొండాపురం వద్దకు రాగానే నిద్రమత్తులో జారి కింద పడి మృతి చెందాడు. మృతిడి కుటుంబ సభ్యులకు తెలియజేశామని పోలీసులు తెలిపారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రొద్దుటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## రోడ్డు ప్రమాదంలో వ్యక్తికి గాయాలు

**సంబేపల్లె :** చిత్తూరు-కర్నూలు జాతీయ రహదారిపై మంగళవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఓ వ్యక్తి గాయపడ్డ సంఘటన చోటు చేసుకొంది. స్థానికుల వివరాల మేరకు.. మండల కేంద్రంలోని శంఖరాపురానికి చెందిన నరసింహారెడ్డి సుండుపల్లె సమీపంలో రహదారి నిర్మాణ పనులు చేస్తున్న ఓ సంస్థలో బొలేరో డ్రైవర్‌గా పని చేస్తున్నాడు. ఈ క్రమంలోనే విధులు ముగించుకొని బొలేరో వాహనంలో సంబేపల్లెకు వస్తుండగా మండల పరిధిలోని పిఎస్ కాలనీ సమీపాన తమ కంపెనీకి చెందిన మరో వాహనం ఆగిపోవడంతో గమనించాడు. ఆయన అక్కడికి వెళ్లి ఆగి ఉన్న వాహనాన్ని చూస్తుండగా కలకడ వైపు నుంచి ద్విచక్ర వాహనంలో వస్తున్న వాహనదారుడు ఢీకొట్టాడు. ఈ ప్రమాదంలో తీవ్రంగా గాయపడ్డ నరసింహారెడ్డిని 108 సాయంతో రాయచోటి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. మెరుగైన చికిత్స నిమిత్తం కడపకు తరలించినట్లు సమాచారం.

## తాగునీటి కోసం నిరసన



ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేస్తున్న మహిళలు

**సిద్దవటం :** మండలంలోని మాధవరం-1 గ్రామ పంచాయతీ ప్రజలు తాగునీటి కోసం కడప-చెన్నై ప్రధాన రహదారిలో మంగళవారం ఖాళీ బిందెలతో నిరసన వ్యక్తం చేశారు. మాధవరం 1 గ్రామ పంచాయతీ పరిధిలోని పార్వతీపురం, రామక్రిష్ణాపురం, మహబూబ్‌నగర్, ఆలీనగర్, ఎస్‌కేఆర్ నగర్, మాధవరం -1 గ్రామాల్లో నాలుగు రోజులుగా తాగునీరు రాలేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయమై పలు మార్లు గ్రామ సచివాలయ సిబ్బందికి చెప్పినా సమస్య పరిష్కారం కాలేదని అన్నారు. విధిలేని పరిస్థితిలో కడప-చెన్నై ప్రధాన రోడ్డు ఎక్కి నిరసన వ్యక్తం చేశామన్నారు. మా సమస్యపై మండల, జిల్లా స్థాయి అధికారులైనా స్పందించి పరిష్కరించాలని వారు కోరారు.

# సామర్థ్యాల పెంపుతోనే సంఘాల బలోపేతం



శిక్షణ పొందిన వారికి సర్టిఫికెట్లు అందజేస్తున్న మెప్మా పథక సంచాలకులు సురేష్‌రెడ్డి

**కడప కోటిరెడ్డిసర్కిల్ :** సంఘ సమాఖ్య, పట్టణ సమాఖ్య ఆర్పీలు శిక్షణల ద్వారా నైపుణ్యాలు, సామర్థ్యాలను పెంచుకుని సంఘాలను బలోపేతం చేయాలని మెప్మా పథక సంచాలకులు వై.సురేష్‌రెడ్డి తెలిపారు. నిహార్ స్కిల్ ఎడ్యుకేషన్ సెంటర్‌లో గత 15 రోజుల నుంచి సమాఖ్యల ఆర్పీలకు నిర్వహిస్తున్న రెసిడెన్షియల్ శిక్షణ తరగతులు మంగళవారం ముగిశాయి. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన సురేష్‌రెడ్డి మాట్లాడుతూ ప్రభుత్వ సంక్షేమ పథకాలను, మెప్మా చేపడుతున్న కార్యక్రమాలను పేదలైన సంఘ సభ్యులకు అందించి నైపుణ్యాలతో కూడిన సుస్థిర జీవనోపాధులను ఏర్పాటు చేయాలని, తద్వారా పేదల జీవన ప్రమాణాలలో మార్పు తీసుకు రావాలని తెలియజేశారు. అనంతరం శిక్షణ తరగతులు పూర్తి చేసుకున్న 645 మంది ఆర్పీలకు కంప్లీషన్ సర్టిఫికెట్లు, శిక్ష మెటీరియల్ అందజేశారు. ఈ కార్యక్రమంలో మెప్మా అధికారులు ప్రాయిమ్, నాగరాజు, గోపీనాథ్, అబ్బాస్ అలీఖాన్, జిల్లా రీసోర్సు పర్సన్స్ జోసెఫ్, చంద్రశేఖర్, శోభబాయి, పులివెందుల, రాయచోటికి చెందిన ఆర్పీలు పాల్గొన్నారు.

# మాజీ సైనికుల స్థలాల ఆక్రమణను అడ్డుకోండి



రెవెన్యూ అధికారికి వినతిపత్రం ఇస్తున్న మాజీ సైనికులు

**పోరుమామిళ్ల :** దేశ రక్షణ కోసం పాటుపడిన తమకు ప్రభుత్వం ఇచ్చిన ఇంటి స్థలాలను కాపాడాలని మాజీ సైనికులు కోరారు. ఈ మేరకు వారు మంగళవారం తహసీల్దారు కార్యాలయంలో వినతిపత్రం ఇచ్చారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రభుత్వం 2012లో రంగసముద్రం రెవెన్యూ భూమి సర్వే నంబర్ 1263లో 315 మంది మాజీ సైనికులకు 3 సెంట్ల ప్రకారం ఇంటి పట్టాలు ఇవ్వడం జరిగిందన్నారు. చాలా ప్లాట్లు ఇంకా ఖాళీగా ఉండడంతో సీపీఎం నేత వాటిని ఆక్రమించి అమ్ముకోవడం మొదలు పెట్టాడన్నారు. ఒక్కో ప్లాటు రూ.1,70,000 ప్రకారం అమ్ముకున్నాడని, ఇక్కడే కాకుండా ఎక్కడ ఖాళీ ప్లాటు ఉంటే దాన్ని కబ్జా చేసి అమ్ముకుంటున్నాడన్నారు. అడిగినా, అడ్డుకున్నా సీపీఎం కార్యకర్తలను ఎగదోసి అతనికి అడ్డు లేకుండా చేసుకుంటున్నాడన్నారు. కావున ఆక్రమణలను అధికారులు అరికట్టాలని కోరారు. కార్యక్రమంలో మాజీ సైనికులు పాల్గొన్నారు.

# అత్తింటి ఆరళ్లకు అబల బలి

**మదనపల్లె :** అత్తింటి ఆరళ్లకు ఓ అబల బలైంది. మండలంలోని పొన్నూటిపాళ్యం పంచాయతీ భువనేశ్వరి నగర్‌లో నివాసం ఉంటున్న అనూష అదనపు కట్నం కోసం అత్తింటివారి వేధింపులు భరించలేక సోమవారం రాత్రి ఉరివేసుకుని ఆత్మహత్య చేసుకుంది. తాలూకా సీఐ సత్యనారాయణ తెలిపిన వివరాల ప్రకారం.. రామసముద్రం మండలం పెద్దకురప్పల్లెకు చెందిన అమ్ములు, చిన్నస్వామి కుమార్తె అనూష(22)కు కర్ణాటకలోని రాయల్పాడు మండలం శునకల్ ప్రాంతానికి చెందిన అశోక్‌తో రెండేళ్ల క్రితం వివాహమైంది. భార్యాభర్తలిద్దరూ వివాహం తర్వాత భువనేశ్వరినగర్‌లో నివాసం ఉంటున్నారు. వివాహ సమయంలో అనూష తల్లిదండ్రులు అశోక్‌కు రూ.2 లక్షల నగదు, 150 గ్రాముల బంగారు ఇచ్చి వివాహం చేశారు. అలాగే కారు తీసుకోవాలంటే రూ.2 లక్షలు ఇచ్చారు. ఇది చాలక మళ్లీ అదనంగా డబ్బు కావాలని భర్త అశోక్, అత్తామామలు రెడ్డెమ్మ, కృష్ణప్పలు వేధింపులకు గురిచేస్తుండటంతో సోమవారం రాత్రి అనూష ఇంట్లో ఉరి వేసుకుని ఆత్మహత్యకు యత్నించింది. గమనించిన భర్త వెంటనే ఆమెను కిందకు దించి మదనపల్లె ప్రభుత్వ జిల్లా ఆస్పత్రికి తరలించారు. ఆస్పత్రికి చేరేటప్పటికే అనూష మృతి చెందడంతో మృతదేహాన్ని మార్చురీకి తరలించారు. అనూష మృతి చెందిన విషయం తెలుసుకున్న ఆమె తల్లిదండ్రులు ఆస్పత్రి వద్దకు చేరుకుని విగతజీవిగా పడి ఉన్న కూతురిని చూసి దుఃఖసంద్రంలో మునిగిపోయారు. తమ కుమార్తె అదనపు కట్నం తేలేదని అత్తింటివారే తమ బిడ్డను పొట్టన పెట్టుకున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వరకట్న వేధింపులతోనే తమ బిడ్డ చనిపోయినట్లు పోలీసులకు ఫిర్యాదు చేశారు. మదనపల్లె డీఎస్పీ కేశప్ప ఆస్పత్రి వద్దకు చేరుకుని ఇరు వర్గాల వారిని విచారణ చేశారు. అనూష తల్లిదండ్రుల ఫిర్యాదు మేరకు మృతురాలి భర్త అశోక్, అత్తామామలపై వరకట్న కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు సీఐ సత్యనారాయణ, ఎస్‌ఐ సుధాకర్ తెలిపారు.